ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యంతో నష్టమే

టీజీఎంసీ బృందం

ఏనుకుంట తండాలో వివరాలు సేకరిస్తున్న టీజీఎంసీ బృందం

తొర్రూరు, నవంబర్ 7: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనుకుంట తండాకు చెందిన గిరిజన బాలిక బానోత్ ఐశ్వర్య(16)కు నకిలీ వైద్యుడు చెన్నా సారయ్య వైద్యం చేయడంతో గత నెల 25న మృతి చెందిన ఘటనపై సుమోటోగా తీసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్ కుమార్ నేతృత్వంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మియా, వరంగల్ లీగల్, ఆంటీ క్వారీ కమిటీ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ శిరీశ్, సభ్యుడు డాక్టర్ రితేశ్‌తో కూడిన బృందం గురువారం విచారణ చేపట్టింది. మండలంలోని అరిపిరాలలో చట్టవిరుద్ధంగా అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడు చెన్నా సారయ్య క్లినిక్ సెంటర్‌ను తనిఖీ చేసింది. సారయ్య కనీసం పదో తరగతి కూడా పాస్ కాకుండానే ఆర్ఎంపీగా అవతారమెత్తి తెలిసీ తెలియని వైద్యం చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు టీజీఎంసీ బృందం గుర్తించి తగు ఆధారాలు సేకరించింది. ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌లో ఫార్మసిస్ట్ లేకుండా సాయిరాం మెడికల్ షాప్ నిర్వహిస్తూ, మందులు విక్రయిస్తున్నాడని డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అతడికి ఫార్మసీ సర్టిఫికెట్ ఇచ్చిన గజవెల్లి స్వాతిపై చర్యలు తీసుకోవాలని ఫార్మసీ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. నకిలీ వైద్యుడు సారయ్యపై ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి బాలిక పెదనాన్న బానోత్ శంకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నకిలీ వైద్యుడు సారయ్య ఇచ్చిన ఇంజెక్షన్స్ వల్ల బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు విచారణ బృందంతో కన్నీటి పర్యంతం అయ్యారు. తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, మహబూబాబాద్ ప్రభుత్వ దవాఖానలో శవపరీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యులు కారని, ప్రజలు తెలియక వాళ్ల వద్దకు వెళ్లి ఎటువంటి ఇంజెక్షన్లు తీసుకోవద్దని వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మీయా తెలిపారు.

ప్రతి కుటుంబానికి స్మార్ట్‌కార్డు

- రైతుల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన అందించాలి
- పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తొర్రూరు : అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

తొర్రూరు, నవంబర్ 7: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ డిజిటల్ కార్డులు అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జనగామ, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు షేక్ రిజ్వన్‌భాషా, అద్వైత్ కుమార్‌సింగ్, సంబంధిత అధికారులతో కలిసి తొర్రూరులోని మిషన్ భగీరథ అతిథి గృహంలో అభివృద్ధి పనులపై మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సన్నరకాలను సర్టిఫై చేసి కొనుగోలు చేయలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలని, పాలకుర్తి పరిధిలోని ఇరిగేషన్ రిజర్వాయర్లు, కెనాల్స్‌కు మరమ్మతులు చేసి, అవసరమున్న చోట కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఉపాధి పనులను వెంటనే పూర్తి చేయాలని, మహబూబాబాద్, జనగామ జిల్లాల పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలల మంజూరుకు స్థలాన్ని సేకరించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ ఆక్రమణలను గుర్తించి సంబంధిత వారికి నోటీసులు అందించి చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అన్నిశాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందించే సేవలపై స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ల సూచనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు విద్యుత్, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనంతరం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి అధ్యక్షతన తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అనుమాండ్ల తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేందుకు వీఆర్‌వో వ్యవస్థను మళ్లీ తీసుకువస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రూనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

దంతాలపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతూ రాంచంద్రూనాయక్‌తో కలిసి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తేమశాతంపై ధాన్యాన్ని ఆరబెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, సీఈవో తండా వెంకన్న, తొర్రూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భట్టునాయక్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

డోర్నకల్: మన్నెగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో నర్మద

డోర్నకల్, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఈవో నర్మద అన్నారు. గురువారం మన్నెగుడెంలో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. సర్వేకు ప్రజలు సహకరించాలని, ఎ లాంటి లోపాలు లేకుండా నిష్పక్షపాతంగా అన్ని వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మీర్జా మున్వర్‌బేగ్, ఎమ్యునలేటర్లు గురుస్వామి, శారద, వసంత, ఐకేపీ సీసీ మంజుల పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో సమగ్ర కుల గణన సర్వే కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకొని స్టిక్కర్లు వేశారు. తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీడీవో రామారావు గుండంరాజుపల్లిలో సర్వే ప్రక్రియను పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

ముఖేశ్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కంబాలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కారం ముఖేశ్ ఎంపికైనట్లు హెచ్‌ం విష్ణువర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో తాండూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్

జగదీశ్వర్

శ్రీనివాస్

నర్సింహులపేట, నవంబర్7: మండల కేంద్రానికి చెందిన కొండబత్తిని జగదీశ్వర్‌ను పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వల్లకంటి రాజ్‌కుమార్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ.. పద్మశాలీ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని, హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపాడు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్

మరిపెడ: పద్మశాలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మరిపెడకు చెందిన దిగజర్ల శ్రీనివాస్ ఎన్నికైనట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ బాధ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పెద్దవంగర, నవంబర్ 7: రైతును రాజు చేయాలనే సంకల్పంతోనే ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల్లో ఇబ్బందులుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఏపీవో స్వామి, ఏపీఎం రమణాచారి, అధికారులు, నాయకులు నిరంజన్‌రెడ్డి, నెహ్రూనాయక్, సురేశ్, మురళి, వెంకన్న, ఉప్పలయ్య, మహిళలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై జీనత్‌కుమార్

గార్ల, నవంబర్ 7: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీల విజేతలకు గురువారం ఎస్సై జీనత్‌కుమార్ బహుమతులు అందజేసి అనంతరం మాట్లాడారు. క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ప్రథమ బహుమతి మహబూబాబాద్ జట్టు, ద్వితీయ బహుమతి గార్ల, తృతీయ బహుమతి ఖమ్మం జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ రామన్న, ప్రధాన కార్యదర్శి సూత్రపు జయశంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: మున్సిపాలిటీకి రావాల్సిన ఎస్‌డీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. గురువారం హైదరాబాద్‌లో పురపాలకశాఖ సీడీఎంఏ శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. మానుకోట మున్సిపాలిటీకి రూ.7కోట్లతో ఇంటిగ్రేడెట్ మార్కెట్, వైకుంఠధామం పనులు చేశామని, అందులో రూ.3.20కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన రూ.ఆరు కోట్ల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయాలని, ఎస్‌డీఎఫ్ కింద రూ.20కోట్ల పనులు చేశామని, వెంటనే నిధులు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంబీ రికార్డ్ అధికారుల చేతివాటం..?

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: అభివృద్ధి పనులకు ఎంబీ రికార్డ్ చేసే అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం. ప్రధానంగా విద్యుత్ శాఖలో పలు అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ వేసి ఎంబీ రికార్డులు చేసే ఉద్యోగులు ఈ పని చేస్తున్నట్లు మండలస్థాయి ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. మానుకోట డివిజన్ విద్యుత్ అభివృద్ధి పనుల చెల్లింపుల్లో కాంట్రాక్టర్ల నుంచి ఎక్కువ పర్సంటేజీలు తీసుకొని ఈ పని చేస్తున్నారని, తొలుత అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ వేసిన దానికంటే ఎక్కువ మొత్తంలో బిల్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారమంతా ఓ బిల్లుల చెల్లింపుల ఆడిట్‌లో నిజాలు బయటకు వచ్చినట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే మరిన్ని నిజాలు బయటకు వస్తాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

IN THE COURT OF THE JUNIOR CVIL JUDGE THORRUR AT THORRUR

O.S. No. 80 OF 2024

Between:
Kinnera llamma & Others ...Plaintiffs
AND
1. The Collector Mahabubabad District
2. The Tahasildar Thorrur
3. To whom All Concerned
...Defendants

That the Plaintiffs filed the above suit for declaring the plaintiffs are the Legal Heirs of the deceased Kinnera Guruvaiah and the said suit is stands posted to 27-11-2024. To whom all concerned D3, If any person or persons having any objections or claims they may appear on 27-11-2024 at 10.30 am either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

(BY ORDER OF COURT)
Sd/- **NARKUTI GOPAL**
Advocate, Thorrur
Counsel for Plaintiffs-Cell: 9948742423

చికిత్స పొందుతూ మహిళ మృతి

డోర్నకల్, నవంబర్ 7: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన రాజు తండాలో గురువారం జరిగింది. సీఐ భూక్యా రాజేశ్ కథనం ప్రకారం.. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజుతండాకు చెందిన లావుడ్యా సోనా(36) ఈనెల ఒకటిన భర్త సురేశ్ మద్యం తాగి రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సోనా భర్తను బెదిరించేందుకు ఇంట్లో ఉన్న డీజిల్‌ను ఒంటిపై పోసుకోగా సురేశ్ అగ్గిపెట్టతో నిప్పు అంటించాడు. సోనా శరీరం 90 శాతం కాలిపోగా, సురేశ్ చేతులు, మొఖంపై గాయాలయ్యాయి. వారిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోనా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు..

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: పట్టణంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు. ఏరియా దవాఖాన పరిసర ప్రాంతాల్లో బక్కపల్చని వృద్ధుడు మృతి చెంది రోడ్డుపై పడి ఉన్నాడని, దవాఖాన సెక్యూరిటీ కవటం రవి ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే వెళ్లి మృతదేహాన్ని తీసుకొచ్చి మార్చురీలో భద్రపర్చామని, సమాచారం తెలిసిన వారు టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్'కు విద్యార్థి ఎంపిక

పెద్దవంగర, నవంబర్ 7: పెద్దవంగర ఉన్నత పాఠశాల విద్యార్థి జీ సాద్విక ఈనెల 4న ఉమ్మడి వరంగల్‌లో జరిగిన అండర్-14 విభాగంలో 80 మీటర్ల హార్డిల్ పరుగులో పాల్గొని జిల్లాలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం, ఎంఈవో బీ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 15,16, 17 తేదీల్లో ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం, ఎంఈవో, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

గార్ల, నవంబర్ 7: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. గురువారం రాంపురంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

బయ్యారం, నవంబర్ 7: నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు హెచ్చరించారు. గురువారం మండలం కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో సెక్రటరీ సుచరిత, నరేశ్ ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బయ్యారం ఏజెన్సీలో కొందరు వ్యాపారులు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా పత్తి, మక్కజొన్న వంటి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారు తప్పకుండా మార్కెట్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. కొందరు వ్యాపారులు పొరుగు మార్కెట్‌కు సంబంధించిన లైసెన్స్‌ను అడ్డం పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారని, త్వారా ఇల్లందు మార్కెట్ ఆదాయం కోల్పోతుందని పేర్కొన్నారు. మన మార్కెట్‌ను మనమే అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని, పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకురావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారులకు తగిన లాభాలు వస్తాయన్నారు. లైసెన్స్ లేకుండా, నిబంధనలు పాటించని వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మోహన్‌రావు, హరికృష్ణ, శ్రీను, రంజిత్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో స్టేజీపై పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి

ప్రభుత్వ మీటింగ్‌లో కాంగ్రెస్ నేతలు

వేదికపై నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి, ఇతర నాయకులు

తొర్రూరు, నవంబర్ 7 : తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు వేదికపై కూర్చోవడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి స్టేజీపై కూర్చున్నారు. అదేవిధంగా మరిపెడ మండలం చిల్లంచర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు యాకయ్య పాఠశాలకు సెలవు పెట్టి మరీ ఉపన్యాసకుడిగా మారి అమాత్యుడిని పొగడ్తలతో ముంచెత్తాడు. ఓ పార్టీ నాయకుడికి ప్రభుత్వ ఉద్యోగి వంతపాడడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు

మహబూబాబాద్ రూరల్/ దంతాలపల్లి/ మరిపెడ, నవంబర్ 7: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, మంజుల, రమేశ్, సాధిక్‌అలీ, వేణుగోపాల్, కవిత, రవి, రజినిదేవి, అసగర్ పాల్గొన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపి మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, జేవీవీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, హెచ్ఎం అనంతరావు బహుమతులు అందించారు. నాయకులు జనార్దనాచారి, శ్రీశైలం, స్వప్న, రాజకుమారి ఉన్నారు. మహబూబాబాద్‌లోని కంకరబోర్డ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. హెచ్ఎం మాలోత్ కోట్యానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు.

దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి హామీ మరిచి మోసం చేశారని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని మంద కొమురమ్మనగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రేవంత్‌రెడ్డి హామీలను విస్మరించారన్నారు. ఈ నెల చివరన హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ పాషా, వెంకన్న, శ్రీరాములు, వెంకన్న, ప్రభాకర్, సహదేవుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థులు

రాకేశ్ లక్షిత

కురవి: పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

కురవి/ కేసముద్రం, నవంబర్ 7: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రాజోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు జర్పుల లక్షిత, బీ రాకేశ్, మోదుగులగూడెం పాఠశాల విద్యార్థి వర్షశ్రీ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు రవికుమార్, మోత్కూరి సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 9,10 తేదీల్లో హైదరాబాద్‌లోని కొంపల్లి సన్‌ప్లవర్ వేదిక్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో రాజోలు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పీడీ కాశీనాథ్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. గతనెల 18న మహబూబాబాద్ హైస్కూల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మోదుగులగూడెం పాఠశాల విద్యార్థి వల్లపు వర్షశ్రీ ఎంపికైందని, ఈనెల 8న మేడ్చల్‌జిల్లా మల్కాజిగిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం, పీడీ దార్ల సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా కేసముద్రం మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్ గురువారం తెలిపారు. విద్యార్థి యోగీశ్వర్ గత నెల18 మహబూబాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి బాలాజీ అక్టోబర్ 25న హనుమకొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. అలాగే కురవి మండలం నేరడ మోడల్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి పవన్ అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పీడీ సురేశ్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 8 నుంచి 10 వరకు బిల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌ను పీడీ, అధ్యాపకులు అభినందించారు.

న్యాయం చేయాలని మృతుడి బంధువుల ఆందోళన

ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

బయ్యారం, నవంబర్ 7: తమకు న్యాయం చేసి పరిహారం అందించాలని కోరుతూ మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్ ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు గురువారం ఆందోళన చేశారు. సంత్రాలపోడ్ తండాకు చెందిన బానోత్ ప్రేమ్‌కుమ